తొలిరోజు పది మంది నామినేషన్లు

- మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ గ్రాడ్యుయేట్ స్థానానికి ఆరుగురు, టీచర్స్‌కు ముగ్గురు
- వరంగల్-కరీంనగర్-నల్లగొండ టీచర్స్‌కు ఒకరి నామినేషన్
- మొత్తం 10 మంది 14 సెట్ల నామినేషన్లు దాఖలు

హైదరాబాద్, ఫిబ్రవరి 3 (నమస్తే తెలంగాణ): ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైన తొలిరోజైన సోమవారం 10 మంది అభ్యర్థులు 14 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ గ్రాడ్యుయేట్ నియోజకవర్గం నుంచి ఆరుగురు ఎనిమిది సెట్ల నామినేషన్లు, టీచర్స్ స్థానం నుంచి ముగ్గురు ఐదు సెట్ల నామినేషన్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు సమర్పించారు. అలాగే వరంగల్-కరీంనగర్-నల్లగొండ టీచర్స్ స్థానం నుంచి ఒకే అభ్యర్థి నామినేషన్ వేశారు. 3 నుంచి 10 వరకు సెలవు దినాల్లో (8,9 తేదీల్లో) మినహా మిగతా రోజుల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు.

1995లో పాడుబడ్డట్టుగా హైదరాబాద్

మొదటిపేజీ తరువాయి...

చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఢిల్లీకి వస్తే చాలా బాధగా ఉన్నదని, ఎప్పుడో 1995లో పాడుబడిపోయిన హైదరాబాద్ మాదిరిగా ఢిల్లీ తయారైందని అన్నారు. ఢిల్లీ అలా అవ్వడానికి కారణం ఎవరు? పదేండ్లు ఎవరు పరిపాలించారు అని ప్రశ్నించారు. ఈ పదేండ్లు డబుల్ ఇంజిన్ సర్కార్ అధికారంలోకి వచ్చి ఉంటే వాషింగ్టన్ డీసీ, న్యూయార్క్‌ను తలదన్నేలా ఢిల్లీ తయారయ్యేదని చెప్పుకొచ్చారు. బాబు వ్యాఖ్యలపై తెలంగాణ ప్రజలు సోషల్ మీడియాలో భగ్గుమంటున్నారు. చంద్రబాబు అంత చెత్త పొలిటీషియన్ దేశంలోనే ఎక్కడా లేడని మండిపడుతున్నారు. బాబు రాజకీయాల్లోకి రాకపోయుంటే తెలుగు రాష్ట్రాలు ఎంతో అభివృద్ధి చెందేవని కామెంట్లు పెట్టారు. చంద్రబాబు కంటే ముందే హైదరాబాద్‌కు వందల ఏండ్ల గొప్ప చరిత్ర ఉన్నదని నెటిజన్లు గుర్తుచేస్తున్నారు. చంద్రబాబు వ్యాఖ్యలు తెలంగాణపై ఆయనకు ఉన్న వ్యతిరేకతను వెల్లడిస్తున్నాయని ఎక్స్ వేదికగా నెటిజన్లు విమర్శిస్తున్నారు.

ఉద్యోగాలు భర్తీ చేయరా?

- డీఎస్సీ-2008 అభ్యర్థులను ఇంకెన్నాళ్లు క్షోభపెడ్తారు?
- కుంటిసాకులతో నియామకాలను వాయిదా వేసేందుకు వీల్లేదు
- ఇప్పటికైనా చేపట్టకపోతే అధికారులు కోర్టుకు రావాల్సిందే
- రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన హైకోర్టు



హైదరాబాద్, ఫిబ్రవరి 3 (నమస్తే తెలంగాణ): ఉద్యోగాల కోసం ఏండ్ల తరబడి ఎదురుచూస్తున్న డీఎస్సీ-2008 అభ్యర్థులకు సుదీర్ఘ నిరీక్షణ తప్పదా? అని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీసింది. ఎన్నికల కోడ్ పేరుతో వారిని ఎంత కాలం క్షోభపెడతారని ప్రశ్నించింది. ఎన్నికల ప్రవర్తనా నియామవళి అంటూ మళ్లీ నియామకాలను వాయిదా వేస్తారా? అని అసంతృప్తిని వ్యక్తం చేసింది. నియామకాలు చేపట్టకుండా ఇంకెన్నేళ్లు కాలయాపన చేస్తారని నిగ్గదీసింది. 2024 ఫిబ్రవరిలో ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయాల్సిందేనని తేల్చిచెప్పింది. పాత నోటిఫికేషన్‌ను అమలు చేసేందుకు ఎన్నికల ప్రవర్తనా నియమావళితో ఎలా ముడిపెడతారని మండిపడింది. హైకోర్టు ఆదేశించాక ఎన్నికల నియమావళితో సంబంధం ఉండదని, ఎన్నికల కోడ్‌తో ముడిపెట్టడానికి వీల్లేదని, కుంటిసాకులు చెప్పి నియామకాలను వాయిదా వేయడం కుదరదని ప్రభుత్వానికి స్పష్టం చేసింది. గడువును పొడిగించే ప్రసక్తే లేదని వెల్లడించింది. ఇప్పటికే నిరుద్యోగులు ఏండ్ల తరబడి ఎదురుచూస్తున్న విషయాన్ని ప్రభుత్వం విస్మరించకూడదని, ఈసారి కూడా నియామకాలు చేపట్టకపోతే తదుపరి విచారణకు ప్రభుత్వ ఉన్నతాధికారులు హాజరుకావాల్సి ఉంటుందని హెచ్చరించింది. తదుపరి విచారణను ఈ నెల 10కి వాయిదా వేసింది. ఈ మేరకు జస్టిస్ అభినందకుమార్ షావిలీ, జస్టిస్ ఈ తిరుమలాదేవి ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. అంతకుముందు ప్రభుత్వం తరపున అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి వాదన వినిపించారు. డీఎస్సీ-2008 నోటిఫికేషన్‌కు సంబంధించిన 1,382 పోస్టుల భర్తీకి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నప్పటికీ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో నియామకాలు చేపట్టలేకపోతున్నట్టు చెప్పారు. డీఎస్సీ-2008లో భర్తీకాని ఎన్జీటీ పోస్టులను ఏపీ తరహాలో (రిటైర్ అయ్యే వరకు కొనసాగించేలా) అర్హులైన బీఈడీ అభ్యర్థులను కాంట్రాక్టు పద్ధతిలో నియమించాలని నిరుడు హైకోర్టు జారీచేసిన ఉత్తర్వుల అమలుకు మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటైందని, క్యాబినెట్ సబ్ కమిటీ సిఫారసులకు అనుగుణంగా నియామకాలు చేపట్టేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని తెలిపారు. డీఎస్సీ-2008లో అర్హత పొందిన 2,367 మంది అభ్యర్థుల్లో 1,382 మంది కాంట్రాక్టు నియామకాలకు సుముఖత వ్యక్తం చేశారని, వారి నియామకాలకు గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ అడ్డంకిగా మారిందని, గత నెల 23న ఆ నోటిఫికేషన్ జారీ అయిందని వివరించారు. ఎన్నికల కోడ్ ముగియగానే ఉద్యోగ నియామకాలు పూర్తిచేస్తామని చెప్పారు. దీనిపై హైకోర్టు ఘాటుగా ప్రతిస్పందించింది. గతంలో తాము జారీచేసిన ఉత్తర్వుల అమలుకు ఎన్నికల కోడ్ ఎలా అడ్డంకి అవుతుందని ప్రశ్నించింది.

సీఎం రేవంత్ పిటిషన్లపై కక్షిదారులకు నోటీసులు

జన్వాడ డ్రోన్ కేసు, ఎస్సీ, ఎస్టీ కేసు 20కి వాయిదా

హైదరాబాద్, ఫిబ్రవరి 3 (నమస్తే తెలంగాణ): జన్వాడ ఫామ్ హౌస్‌పై డ్రోన్‌ను ఎగురవేసి వీడియో చిత్రీకరించిన కేసుతోపాటు తనపై నమోదైన ఎస్సీ, ఎస్టీ కేసును కొట్టివేయాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్లపై సోమవారం హైకోర్టు విచారణ జరిపింది. ఈ రెండు కేసుల్లో కౌంటర్ల దాఖలు చేయాలంటూ కక్షిదారులకు నోటీసులు జారీచేసిన జస్టిస్ కే లక్ష్మణ్.. తదుపరి విచారణను ఈ నెల 20కి వాయిదా వేశారు.

రాజగోపాల్‌రెడ్డి పిటిషన్‌పై పోలీసులకు నోటీసులు

హైదరాబాద్, ఫిబ్రవరి 3 (నమస్తే తెలంగాణ): చౌటుప్పల్ మండలం లక్కవరంలోని ఎస్ఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఆహార భద్రత కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని అడ్డుకోవడంతోపాటు మంత్రి చేతిలోని మైక్‌ను లాక్కున్నట్టు 2021లో తనపై నమోదైన క్రిమినల్ కేసును కొట్టివేయాన్న కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పిటిషన్‌పై సోమవారం హైకోర్టులో విచారణ జరిగింది. రాజకీయ కక్షతో ఈ కేసు పెట్టారని, రాజగోపాల్‌రెడ్డిపై వచ్చిన అభియోగాలకు ఆధారాలు లేవని ఆయన తరపు న్యాయవాది వాదించారు. ప్రజాప్రతినిధుల కోర్టులో విచారణలో ఉన్న కేసును కొట్టేయాలని, అప్పటివరకు ఈ కేసు విచారణపై స్టే ఇవ్వాలని కోరారు. దీనిపై పోలీసులకు నోటీసులు జారీ చేసిన జస్టిస్ కే లక్ష్మణ్.. తదుపరి విచారణను వాయిదా వేశారు.

రైల్వే బడ్జెట్‌లో తెలంగాణకు 5,337 కోట్లు

- సికింద్రాబాద్‌లో కవచ్ ఎక్స్‌లెన్స్ సెంటర్
- కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడి

హైదరాబాద్, ఫిబ్రవరి 3 (నమస్తే తెలంగాణ): రైల్వే బడ్జెట్‌లో తెలంగాణకు రూ.5,337 కోట్లు కేటాయించినట్టు ఆ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. సోమవారం ఆయన హైదరాబాద్‌లోని రైల్వే అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ.. రాష్ట్రంలో కొత్త రైల్వే స్టేషన్ల నిర్మాణం, వర్క్‌షాప్‌ల ఏర్పాటు సహా ఇతర అభివృద్ధి పనులకు రూ.41,667 కోట్ల వరకు పెట్టుబడులు పెట్టనున్నట్టు చెప్పారు. తెలంగాణలో రైల్వే లైన్లను 100% విద్యుదీకరించినట్టు తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో 5 వందే భారత్ రైళ్లు నడుస్తున్నాయని, వాటి సంఖ్య మరింత పెంచుతామని స్పష్టం చేశారు. తెలంగాణలో 1,465 కి.మీ. మేర కవచ్ వ్యవస్థను ఏర్పాటు చేశామని, సికింద్రాబాద్‌లో కవచ్ ఎక్స్‌లెన్స్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామని చెప్పారు. అమృత్ భారత్ స్టేషన్ల పథకంలో భాగంగా 40 స్టేషన్లను అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. బడ్జెట్‌లో ఏపీకి రూ.9,417 కోట్లు మంజూరు చేశామని, వివిధ రైల్వే ప్రాజెక్టుల అభివృద్ధి కోసం ఆ రాష్ట్రంలో రూ.84,559 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నామని ప్రకటించారు. ప్రస్తుతం ఏపీలో 8 వందే భారత్ రైళ్లు నడుస్తున్నట్టు తెలిపారు. అమృత్ భారత్ స్టేషన్ల పథకం కింద ఏపీలో 73 రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్, ఇతర సీనియర్ రైల్వే అధికారులు పాల్గొన్నారు.

బోధన్‌లో కేంద్ర బడ్జెట్ ప్రతుల దహనం

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ రైతులు, పేదలకు తీవ్ర అన్యాయం జరిగిందని పేర్కొంటూ సీపీఎం నాయకులు సోమవారం నిజామాబాద్ జిల్లా బోధన్‌లోని అంబేద్కర్‌చౌరస్తాలో బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బడ్జెట్ కేవలం కార్పొరేట్ రంగాన్ని ప్రోత్సహించేలా ఉన్నదని ఆరోపించారు. – శక్కర్‌నగర్

6 వేల పింఛన్ ఇవ్వాలని దివ్యాంగుల నిరసన

రూ.6 వేల పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ దివ్యాంగులు సోమవారం సూర్యాపేట జిల్లా తుంగతుర్తి ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. కాంగ్రెస్ హామీ అధికారంలోకి వచ్చి ఏడాదైనా అమలు చేయడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీడీవో శేషుకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. – తుంగతుర్తి

ప్రాక్టికల్స్ విధులు కొందరికే..!

- ప్రైవేట్, మాడల్ లెక్చరర్లకు కేటాయించని వైనం
- సర్కారు కాలేజీల్లోని వారికే డ్యూటీలు
- వ్యతిరేకిస్తున్న ప్రైవేట్ యాజమాన్యాలు, మాడల్ టీచర్లు
- మూల్యాంకనాన్ని బహిష్కరిస్తామంటూ హెచ్చరికలు

హైదరాబాద్, ఫిబ్రవరి 3 (నమస్తే తెలంగాణ) : ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షల ఎగ్జామినర్ విధులు కొందరు లెక్చరర్లకే కేటాయించడం రగడకు దారితీసింది. ఇంటర్‌బోర్డు పక్షపాత వైఖరిపై పలు సంఘాల నేతలు తీవ్రంగా మండిపడుతున్నారు. ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కాగా, కేవలం సర్కారు కాలేజీల లెక్చరర్లకు ఎగ్జామినర్ డ్యూటీలు వేసింది. మాడల్ స్కూళ్లల్లో ఇంటర్ పాఠాలు బోధిస్తున్న రెగ్యులర్ అధ్యాపకులకు, సర్కారు కాలేజీల్లో గెస్ట్ లెక్చరర్లకు డ్యూటీలు వేయలేదు. కేజీబీవీ టీచర్లకు మాత్రం అవకాశం కల్పించారు. మొత్తం మూడు విడతల్లో ప్రాక్టికల్స్ పరీక్షలు జరగనుండగా, ఒక్కో లెక్చరర్‌కు 12 నుంచి 14 రోజులు విధులు కేటాయించారు. ఈ సారి కేవలం ప్రభుత్వ జేఎల్స్‌కు మాత్రమే స్క్వాడ్, ఫ్లైయింగ్ స్క్వాడ్ డ్యూటీలు కేటాయించారు. ఇలా ఇష్టారీతిన డ్యూటీలు వేయడంతో కొందరు మాడల్, ప్రైవేట్ కాలేజీల్లోని లెక్చరర్లు కినుక వహించారు. వీరు జవాబు పత్రాల మూల్యాంకనాన్ని బహిష్కరించే యోచనలో ఉన్నట్టు తెలిసింది. అయితే సీసీ కెమెరాల ఏర్పాటు నిబంధన అన్ని చోట్ల అమలుకాలేదని తెలిసింది. మొత్తంగా గందరగోళంగా ప్రాక్టికల్స్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. కొన్ని చోట్ల సాంకేతిక సమస్యలు కూడా తలెత్తాయని కాలేజీల యాజమాన్యాలు తెలిపాయి.

మూల్యాంకనాన్ని బహిష్కరిస్తాం

మాడల్ స్కూల్, జూనియర్ కాలేజీల్లో రెగ్యులర్ అధ్యాపకులే 12 ఏండ్లుగా సేవలందిస్తున్నారు. కానీ వీరికి ప్రాక్టికల్స్ విధులు కేటాయించకపోవడం గర్హనీయం. కేవలం సర్కారు కాలేజీల రెగ్యులర్ అధ్యాపకులకే విధులు కేటాయించారు. ఇలా చేయడం మమ్మల్ని కించపరచడమే. ఇంటర్‌బోర్డు చర్యలతో మా ఆత్మగౌరవం దెబ్బతిన్నది. వార్షిక పరీక్షల్లో సీఎస్‌డీవో, కస్టోడియన్ వంటి విధులను కేటాయించాలి. లేదంటే స్పాట్ క్యాంప్‌ను బహిష్కరిస్తాం. ఇతర విధులకు దూరంగా ఉంటాం. మూల్యాంకనాన్ని బహిష్కరిస్తాం. – తరాల జగదీశ్, పీఎంటీఏ, టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు

ఇన్నారెడ్డికి రెండు సంఘాల మద్దతు

హైదరాబాద్, ఫిబ్రవరి 3 (నమస్తే తెలంగాణ) : కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో సీపీఎస్ఈయూ నుంచి తిరుమలరెడ్డి ఇన్నారెడ్డి పోటీ చేస్తున్నారు. ఇన్నారెడ్డికి రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్తు తెలంగాణ స్టేట్, పాలిటెక్నిక్ లెక్చరర్స్ అసోసియేషన్లు మద్దతు పలికాయి.

పీఆర్టీయూకు టీఎస్ మెసా మద్దతు

టీచర్ ఎమ్మెల్సీ పీఆర్టీయూ టీఎస్ అభ్యర్థులకు తెలంగాణ రాష్ట్ర మైనార్టీ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్ (టీఎస్ మెసా) మద్దతు పలికింది. నల్లగొండ, వరంగల్, ఖమ్మం నియోజకవర్గ అభ్యర్థి పింగిలి శ్రీపాల్‌రెడ్డి, కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ నియోజకవర్గ అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డికి మద్దతు తెలుపుతూ టీఎస్ మెసా రాష్ట్ర నేతలు లేఖ అందజేశారు.

మోత్కూరులో ఎమ్మెల్యే మందుల సామేల్‌కు వ్యతిరేకంగా ఏర్పాటు చేసిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎన్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరి గారి ప్రీతం

తుంగతుర్తి కాంగ్రెస్‌లో అసమ్మతిరాగం

- ఎమ్మెల్యే సామేల్‌కు వ్యతిరేకంగా సమావేశం
- హాజరైన ఎన్సీ కార్పొరేషన్ చైర్మన్, ఆ పార్టీ మండలాల అధ్యక్షులు

మోత్కూరు, ఫిబ్రవరి 3 : తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్‌కు సొంత పార్టీ నాయకులే అసమ్మతి రాగం వినిపిస్తున్నారు. అక్రమ ఆస్తులు, సంపాదన లక్ష్యంగా, పదవులు, పర్సంటేజీలు తప్ప కార్యకర్తలను పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ.. సోమవారం అసమ్మతివాదులు మోత్కూరులోని ఓ ఫంక్షన్ హాల్‌లో సమావేశం నిర్వహించారు. ఎన్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరి గారి ప్రీతం, డీసీసీ ఉపాధ్యక్షుడు పైళ్ల సోమిరెడ్డి, సూర్యాపేట డీసీసీ ఉపాధ్యక్షుడు యోగానందచార్యులు, మోత్కూరు మండల అధ్యక్షుడు వంగాల సత్యనారాయణ, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వల్లంభట్ల పూర్ణచందర్‌రావు, సీనియర్ నాయకులు నారగోని అంజయ్య గౌడ్ హాజరై మాట్లాడారు. అవకాశం కోసం వచ్చిన సామేల్‌ను ఆదరించి పార్టీ టికెట్ ఇచ్చి ఎమ్మెల్యేగా గెలిపిస్తే, కార్యకర్తలను ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాల్లో కలుపుకొని పోకపోగా అక్రమ కేసులను పెట్టి పోలీసులతో వేధింపులకు గురి చేస్తున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. పనుల కోసం తన దగ్గరకు వెళ్లిన వారిని 'నా మనిషివి కాదని, పలాన మంత్రి మనిషివి' అంటూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్యే సామేల్ నాయకులందరినీ కలుపుకొని పోవాలని, లేకపోతే సహించేది లేదని, ప్రతి పర్యటనను అడ్డగిస్తామని హెచ్చరించారు. తెలంగాణ ఉద్యమకారుడిని అని చెప్పుకునే నైతిక హక్కు ఆయనకు లేదని శ్రీకాంతాచారి తల్లి కాసోజు శంకరమ్మ మండిపడ్డారు. పదేండ్లలో ఏనాడు అమరులను తలచి నివాళి అర్పించలేదని విమర్శించారు.

ఆర్టీసీని కాపాడుకుంటాం

- సమస్యల పరిష్కారానికి పోరాడుతూనే ఉంటాం
- జేఏసీ నేతలు వెల్లడి

హైదరాబాద్, ఫిబ్రవరి 3 (నమస్తేతెలంగాణ): కార్మికులను భయభ్రాంతులకు గురిచేయడానికి ఆర్టీసీ యాజమాన్యం ప్రయత్నిస్తున్నదని జేఏసీ నేతలు మండిపడ్డారు. సమ్మె నోటీసు ఇచ్చినప్పటి నుంచి ఈ తతంగం నడుస్తున్నదని ధ్వజమెత్తారు. డిమాండ్లను పరిష్కరించకుండా పక్కనపెట్టి ప్రతిరోజూ డిపోలలో గేట్ మీటింగ్‌లు నిర్వహిస్తూ కార్మికులను భయభ్రాంతులకు గురిచేస్తున్నదని వివరించారు. ఆర్టీసీ యాజమాన్యం వ్యవహరిస్తున్న తీరుపై చర్చించడానికి జేఏసీ ప్రతినిధులు సోమవారం అత్యవసరంగా సమావేశమయ్యారు. భవిష్యత్ కార్యాచరణపై చర్చించి పలు తీర్మానాలు చేశారు. అనంతరం జేఏసీ చైర్మన్ వెంకన్న, వైస్ చైర్మన్ థామస్‌రెడ్డి, కన్వీనర్ మౌలానా, కో-కన్వీనర్లు యాదయ్య, సురేశ్ మాట్లాడుతూ.. 'ఆర్టీసీ పుట్టినప్పటి నుంచి లేని ప్రమాదం ఎలక్ట్రిక్ బస్సులతో ఉన్నది. 2025లో 2,800 ప్రైవేట్ ఎలక్ట్రిక్ బస్సులు రాబోతున్నాయని, ఇవే కాకుండా రాబోయే రోజుల్లో 3 వేల బస్సులు తీసుకువస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించినప్పటికీ యాజమాన్యం ఆ విషయాన్ని తేలికగా తీసుకుంటున్నది. మహిళా సంఘాలతో మరో 600 ప్రైవేట్ బస్సులను కొంటామని రవాణాశాఖ మంత్రి చెప్తున్నారు. ఇటు సీఎం, అటు రవాణా మంత్రి మాటలను పరిశీలిస్తే ఆర్టీసీని ప్రైవేట్ పరం చేయడానికి ప్రభుత్వం కంకణం కట్టుకున్నట్టు కనిపిస్తున్నది. ఎన్నో ఏండ్ల నుంచి మా రక్తాన్ని ధారబోసి కట్టుకున్న డిపోలను ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్పుతున్నారు. డిపోలను తమ సొంత ఇంటిగా భావించి 30-40 ఏండ్ల నుంచి విధులు నిర్వర్తిస్తున్న కార్మికులను బలవంతంగా గెంటివేస్తున్నారు. కార్మికుల ఆవేదన ఉన్నతాధికారులకు కనిపించడం లేదా?' అని ప్రశ్నించారు. సంస్థను కాపాడుకోవడానికి, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి జేఏసీ పోరాడుతున్నదని తెలిపారు. తమ పోరాటానికి అధికారులు, సూపర్‌వైజర్లు, ఇతర కార్మిక సంఘాలు మద్దతుగా నిలువాలని కోరారు. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న డిపోలను సందర్శించి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని జేఏసీ నేతలు పేర్కొన్నారు.

గతి తప్పుతున్న 'గమ్యం' యాప్

హైదరాబాద్, ఫిబ్రవరి 3 (నమస్తేతెలంగాణ): ఆర్టీసీ ప్రవేశపెట్టిన 'గమ్యం' యాప్ గతితప్పుతున్నది. ఈ యాప్ సరిగా పనిచేయకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందిపడుతున్నారు. యాప్‌లో చూపించిన సమయం కన్నా అరగంట ఆలస్యంగా లేదా గంట ముందుగానే బస్సులు రాకపోకలు సాగిస్తున్నట్టు ఫిర్యాదులు వస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో బస్సులే లేవంటూ యాప్‌లో కనిపించడంతో ప్రయాణికులు గందరగోళానికి గురవుతున్నారు. బస్సుల్లో ఉండే చిప్‌లలో సర్వీసు రూట్ల వివరాలు నమోదు చేయడంలో సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నట్టు ఫిర్యాదులు ఉన్నాయి. దీన్ని పరిష్కరించడంలోనూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్టు కనిపిస్తున్నది.

ఏపీ సీపీఎం రాష్ట్ర కార్యదర్శిగా శ్రీనివాసరావు

హైదరాబాద్, ఫిబ్రవరి 3 (నమస్తే తెలంగాణ): సీపీఎం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శిగా వీ శ్రీనివాసరావు మళ్లీ ఎన్నికయ్యారు. నెల్లూరులో జరిగిన రాష్ట్ర మహాసభల్లో భాగంగా సోమవారం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

సినీ నిర్మాత కేపీ చౌదరి ఆత్మహత్య

హైదరాబాద్, ఫిబ్రవరి 3 (నమస్తే తెలంగాణ): సినీ నిర్మాత కేపీ చౌదరి (అలియాస్ కృష్ణప్రసాద్) గోవాలో ఆత్మహత్య చేసుకున్నాడు. తమిళ చిత్రం కబాలీని తెలుగులో రిలీజ్ చేసిన ఆయన ఇటీవల డ్రగ్స్ కేసులో అరెస్టు అయ్యారు. జైలు నుంచి బయటికి వచ్చిన తర్వాత గోవా వెళ్లి అక్కడే ఓ క్లబ్‌ను నడుపుతూ స్థిరపడ్డాడు. క్లబ్ కూడా సరిగా నడవకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురై ఆత్మహత్య చేసుకున్నట్టు తెలుస్తున్నది.

హుజూర్‌నగర్‌లో మంత్రి ఉత్తమ్ ఫ్లెక్సీ పట్టుకొని ఆందోళన చేస్తున్న నిర్వాసితులు

మా గూడు తొలగించొద్దు సారూ

ఉత్తమ్ ఫ్లెక్సీతో నిర్వాసితుల ఆందోళన

హుజూర్‌నగర్, ఫిబ్రవరి 3 : మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డికి సొంత నియోజకవర్గమైన హుజూర్‌నగర్‌లో నిరసన సెగ తగిలింది. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలోని ఫణిగిరి రామస్వామి గుట్ట వద్ద ఎన్నో ఏండ్లుగా ఇండ్లు లేని నిరుపేదలు నివాస గృహాలను ఏర్పాటు చేసుకొని జీవిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం, హుజూర్‌నగర్ ఎమ్మెల్యే ఉత్తమ్ కుమార్‌రెడ్డి మంత్రి కావడం, ఎన్నికల ముందు న్యాయవాదులకు ఆయన హామీ ఇవ్వడంతో ఆ హామీ మేరకు మంత్రి ఉత్తమ్ ఫణిగిరిగుట్ట వద్ద ఉన్న మూడున్నర ఎకరాలను కోర్టు నిర్మాణానికి కేటాయించారు. ఆ స్థలంలో నిరుపేదల ఇండ్లు ఉన్నాయి. ఇండ్లను ఖాళీ చేసి వెళ్లిపోవాలని సోమవారం అధికారులు నోటీసులు జారీ చేయడంతో నిర్వాసితులు మంత్రి ఉత్తమ్ ఫ్లెక్సీతో ప్రధాన రహదారిపై ఆందోళన చేశారు. కొన్నేండ్లుగా నివాసముంటున్న తమను కాదని, కోర్టుకు స్థలం కేటాయించడం ఏమిటంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే ఇండ్ల పట్టాలు ఇస్తామని చెప్పి మోసం చేశారని బాధితులు లబోదిబో మంటున్నారు.

అది నా ఇల్లు.. మనోజ్ వెళ్లిపోవాల్సిందే!

- కుమారుడిపై సినీనటుడు మోహన్‌బాబు తీవ్రఆగ్రహం
- తనకు హక్కు ఉందని, ఖాళీ చేయబోనని మనోజ్ పట్టు
- రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో తండ్రీకొడుకుల వాగ్వాదం
- విచారణ 10రోజులకు వాయిదా వేసిన అడిషనల్ కలెక్టర్

కలెక్టర్ ఎదుట హాజరవడానికి వెళ్తున్న మోహన్‌బాబు, మనోజ్

రంగారెడ్డి, ఫిబ్రవరి 3 (నమస్తే తెలంగాణ): ఆస్తుల వివాదంలో సినీనటుడు మంచు మోహన్‌బాబు, ఆయన కుమారుడు మంచు మనోజ్ సోమవారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో విచారణకు హాజరయ్యారు. జల్‌పల్లి వద్ద తాను సొంతంగా సంపాదించుకున్న ఆస్తిలో మనోజ్ అక్రమంగా నివాసం ఉంటున్నాడని, అతన్ని ఖాళీ చేయించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లోని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ సెల్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా సోమవారం అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ వాదనలు విన్నారు. ఆస్తుల విషయం పెద్దల సమక్షంలో మాట్లాడుకున్న తర్వాతే ఖాళీ చేస్తానని మనోజ్ తెలిపినట్టు సమాచారం. ఇద్దరి వాదనలు విన్న తర్వాత జాయింట్ కలెక్టర్ విచారణను 10 రోజుల పాటు వాయిదా వేశారు.

కలెక్టరేట్‌లోనూ కొట్లాట!

విచారణ కోసం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లోనూ మోహన్‌బాబు, మనోజ్ మధ్య అడుగడుగునా ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. అడిషనల్ కలెక్టర్ చాంబర్‌లోకి వెళ్లేటప్పుడు, రెండు గంటల పాటు జరిగిన విచారణ సమయంలో ఇరువురి మధ్య వాగ్వాదం జరిగిందని, ఓ దశలో ఘర్షణ వాతావరణం నెలకొన్నదని తెలుస్తున్నది. తండ్రీకొడుకుల మధ్య గతంలోనే ఘర్షణ తలెత్తడం, కేసులు నమోదు కావడం నేపథ్యంలో మళ్లీ గొడవలు కాకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. విచారణ తర్వాత ఇద్దరినీ వేర్వేరు గేట్ల నుంచి బయటకు పంపించారు. అధికారులు గేట్లు మూసివేసి, లోపలికి ఎవరినీ అనుమతించలేదు. దీంతో వివిధ పనుల కోసం కలెక్టరేట్‌కు వచ్చిన జనాలు ఆందోళనకు దిగి, అధికారులపై మండిపడ్డారు.

సంస్కరణల ద్వారా మెరుగైన పోలీసింగ్

ఐపీఎఫ్ సమావేశంలో డీజీపీ జితేందర్

హైదరాబాద్, ఫిబ్రవరి 3 (నమస్తే తెలంగాణ) : సంస్కరణల ద్వారా ప్రజలకు మెరుగైన పోలీసింగ్‌ను చేపట్టాల్సి ఉందని డీజీపీ జితేందర్ తెలిపారు. ఇండియన్ పోలీస్ ఫౌండేషన్ (ఐపీఎఫ